గుప్పిట్లో గువ్వ

వాణిశ్రీ

అనుపమ ఎంటర్ ప్రైజస్ సంస్థలో రెండేళ్ళ నుంచీ పనిచేస్తున్నాడు సురేష్. కానీ ఎప్పుడూ యజమాని నరేంద్రభూపతి ఇంటికి వెళ్ళలేదు. వెళ్ళవలసిన అవసరం అతనికి కలగలేదు. రోడ్డుమీద వెళ్తూ ఆ బిల్డింగ్ ని చాలాసార్లు చూశాడు. విశాలమైన ఆవరణలో పూలతోట మధ్య రాజభవనంలా వుంటుంది.

ఇన్నాళ్టికి నరేంద్రభూపతి నుంచి పిలుపు వచ్చింది సురేష్ కి. మేనేజర్ గుండెపోటుతో హాస్పటల్లో చేరాడు. అప్పుడే ముఖ్యమైన అగ్రిమెంట్ చెయ్యాల్సి వచ్చింది. అమెరికానుంచి పార్టీ వచ్చి కూర్చున్నాడు.

మేనేజర్ కి సురేష్ పర్సనల్ సెక్రటరీ. అందువల్ల ఆ బాధ్యత సురేష్ భుజస్కంధాలమీద పడింది. నరేంద్ర భూపతి ఫైల్స్ తీసుకుని ఇంటికి రావల్సిందిగా సురేష్ ని ఆజ్ఞాపించాడు.

కంపెనీనుంచి కారులో అవసరమైన ఫైల్స్ తీసుకుని

బయల్దేరాడు సురేష్. ఆ సమయంలో అతనికి ఎంతో ఆనందం కలిగింది. ఎన్నడూ లేని హుందాతనం ప్రవేశించి నట్లయింది.

తాత్కాలికంగా తను మేనేజర్ బాధ్యత నిర్వహి స్తున్నందుకు గర్వంగా వుంది. మనిషికి హోదావల్ల ఆనందం, గౌరవం, పరపతీ అన్నీ లభిస్తాయి గదా! అను కున్నాడు. తనకీ పదవి శాశ్వతంగా వుంటే యెంతో బాగుండును అని తలపోశాడు. కాని అది అసాధ్యం అని తెలిసి మనసు బాధతో మూలిగింది.

కారు నరేంద్రభూపతి భవనం పోర్టికోలో ఆగింది. యూనిఫారమ్‌లో వున్న నౌకరు కారు డోర్ తెరచి సెల్యూట్ కొట్టాడు. మరొక నౌకరు సురేష్ చేతిలోని ఫైల్స్ అందుకున్నాడు.

"కమాన్ సురేష్! అన్నీ తెచ్చావా?" అని చిరు నవ్వుతో పలకరించాడు నరేంద్రభూపతి.

"యస్సార్!" అన్నాడు సురేష్ వినయంతో.

"మీట్ ది పార్టీ. యురేకా ఎంటర్ ప్రైజెస్ ఆఫ్ అమెరికా. హీ ఈజ్ అవర్ యాక్టివ్ సెక్రటరీ మిష్టర్ సురేష్" అంటూ పరిచయం చేశాడు నరేంద్రభూపతి.

సురేష్ వారితో కరచాలనం చేసి సంతోషం వ్యక్త పరిచాడు.

నరేంద్రభూపతికి డెభ్భై ఏళ్ళున్నా చాలా యాక్టి వ్‌గా కనిపిస్తాడు. పదేళ్ళు తక్కువ వయస్సువాడిలా చూపరులకు గోచరిస్తాడు. అంత ఆరోగ్యంగాను వుంటాడు. కంపెనీ వ్యవహారాలలో కుర్రవాడిలా హుషారుగా పనిచేస్తాడు.

అమెరికా కంపెనీ పార్టనర్స్‌తో అగ్రిమెంట్ పూర్త

య్యేసరికి రాత్రి తొమ్మిది దాటింది. తర్వాత వారికి భూపతి ఇంట్లోనే డిన్నర్ ఏర్పాట్లు జరిగాయి. స్కాచ్ విస్కీ సర్వ్ చేశారు. రకరకాల వెజ్-నాన్-వెజ్ డిష్‌లు తెచ్చి పెట్టారు. సురేష్‌కి డ్రింక్ చేసే అలవాటున్నా యజమానిముందు తీసుకోవడానికి జంకాడు. తనకి అలవాటులేదని మనవి చేసుకున్నాడు.

పదకొండు గంటలకు పార్టీ ముగిసింది. అమెరికన్స్ వాళ్ళు బసచేసిన హోటల్‌కి వెళ్ళిపోయారు. నరేంద్ర భూపతి బాగా డ్రింక్ పుచ్చుకున్నా నిశ్చలంగా కనిపిస్తున్నాడు. మనిషి తూలడంలేదు, తొణకడంలేదు.

సురేష్‌కి మాత్రం చాలా ఆశ్చర్యంగా వుంది. నరేంద్ర భూపతి, నౌకర్లు తప్ప మరి వేరే కుటుంబ సభ్యులు ఎవరూ కన్పించడంలేదు.

ఫ్యామిలీ మెంబర్లంతా ఎక్కడికైనా వెళ్ళారేమో అనుకున్నాడు. ఇక యజమాని దగ్గర సెలవుతీసుకుని వెళ్ళిపోవాలని ఆయన గదిలోకి వెళ్ళి వాకిట్లో నిలుచున్నాడు.

నరేంద్రభూపతి అతన్ని గమనించలేదు. ఆయన చూపులు ఒక ఫోటోమీద వున్నాయి. ఆ ఫోటో పన్నెండేళ్ళ పాపది. ఫుల్ సైజ్‌లో ఎన్‌లార్జ్ చేసి వుంది.

"సార్!...." అన్నాడు సురేష్.

నరేంద్రభూపతి తలతిప్పి చూశాడు.

"నేను వెళ్ళొస్తాను సార్!"

"డిన్నర్ చేశావు గదా!"

"చేశాను సార్!"

"అంతా సవ్యంగా జరిగింది మిష్టర్ సురేష్. మేనేజర్

లేకపోయినా అన్నీ దగ్గరుండి జరిపించావు. ఐ లైక్ యూ!" అన్నాడు నరేంద్ర భూపతి.

"థాంక్యూ వెరీమచ్ సార్!"

"ఇంత రాత్రివేళ ఇంటికి ఏం వెళ్తావు. ఇక్కడే పడుకో."

"ఫరవాలేదు సార్! సార్ ఇంట్లో ఎవరూ కనిపించడంలేదు ఊరు వెళ్ళారా సార్!" అన్నాడు సురేష్.

నరేంద్ర భూపతి ముఖంలో బాధ స్పష్టంగా కనిపించింది.

"ఊరెళ్ళడం కాదు సురేష్. శాశ్వతంగా స్వర్గలోకం వెళ్లారు" అన్నాడాయన. ఆయన కళ్ళలోనుంచి కన్నీరు బుగ్గలమీదకు జారింది.

"సార్!...."

"అవును సురేష్. నాకెవరూ లేరు. ఒక్కడే కొడుకు వుండేవాడు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివాడు అమెరికాలో. వ్యాపారంలో మెలకువలన్నీ తెలుసుకున్నాడు. పెళ్ళిచేశాను. వారికి ఒక అమ్మాయి పుట్టింది. బిజినెస్ అంతా వాడే చూసుకునేవాడు. ఒకసారి ఢిల్లీ నుంచి కొడుకూ, కోడలూ వస్తున్నారు. ట్రెయిన్ యాక్సిడెంట్ జరిగింది. అందులో చనిపోయారు."

"ఐయామ్ సారీ సర్! మరి పాప?"

"చనిపోయే వుంటుంది. కానీ డెడ్‌బాడీ దొరకలేదు. ఆ పాపే అనుపమ. ఆ పేరుతోనే బిజినెస్ చేస్తూ తృప్తి పొందుతున్నాను" అన్నాడు నరేంద్ర భూపతి.

సురేష్ పరీక్షగా ఫోటో వంక చూశాడు. చూడగా చూడగా ఆ ముఖం ఎక్కడో చూసినట్లుగా అనిపించసాగింది. ఎక్కడ? ఎక్కడ? జ్ఞాపకాల పొరలు వెతక

పోగొట్టు. గుర్తు రావడంలేదు.

"సార్! ఈ పాపను ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది సార్!" అన్నాడు సురేష్.

నరేంద్ర భూపతి ఉలిక్కిపడ్డాడు. ఆశగా సురేష్ వంక చూశాడు. అంతలోనే అతని ముఖంలో నిరాశ చోటు చేసుకుంది.

"యాక్సిడెంట్ జరిగి పదేళ్ళయింది. నువ్వెక్కడ చూసి వుంటావు? అంతా భ్రమ" అన్నాడు నరేంద్ర భూపతి.

"భ్రమో? నిజమో కాని సార్! ఇరవై ఏళ్ళ యువతిని ఇదే ముఖంగల ఆమెను చూసినట్లు అనిపిస్తోంది. కాని ఎక్కడ చూశానో? ఎప్పుడు చూశానో మాత్రం జ్ఞాపకం రావడంలేదు. ఒకవేళ పాప యాక్సిడెంట్‌లో బ్రతికి బైటపడి వుండొచ్చు సార్!" అన్నాడు సురేష్.

"నువ్వు వూహించినట్లు జరగడానికి అవకాశం వుంది! బాగా జ్ఞాపకం తెచ్చుకో. నా అనుపమ యెక్కడుందో వెతుకు. ఎంత డబ్బు కావాలన్నా తీసుకో. అనుపమ దొరికితే నువ్వు కోరినంత డబ్బు ఇస్తాను సురేష్!" నరేంద్ర భూపతి అంతులేని ఆనందంతో అంటున్నాడు.

"మీకోసం నేను ఎంత శ్రమపడి అయినా సరే ఆమె కోసం వెతుకుతాను" అన్నాడు సురేష్.

2

వారం రోజులు తీవ్రంగా ఆలోచించాడు సురేష్. అనుపమ పోలికలుగల యువతిని ఎక్కడ చూశాడు? ఎప్పుడు చూశాడు? తల బ్రద్దలు కొట్టుకున్నా గుర్తు రావడంలేదు.

అతనికి డైరీ రాసుకునే అలవాటుంది. పాత డైరీ

అన్నీ వెతికాడు. పేజీలన్నీ తిరగేశాడు. అలా పేజీలు తిరగేస్తూ వుంటే అతని మనసులో ఒక ఫ్లాష్.

సంవత్సరం క్రితం మేనేజర్‌తోపాటు ఢిల్లీ వెళ్ళాడు. వారం రోజులు వుండాల్సొచ్చింది. ఫైవ్ స్టార్ హోటల్లో బస. రోజూ విస్కీ, బీర్ వగైరాలతోపాటు ఖరీదైన భోజనం. మేనేజర్ కమ్మగా నిద్రపోయేవాడు. అతనికి నిద్రపట్టేదికాదు. నరాలు జివ్వుమనేవి. కోరికలు పురులు విప్పేవి. అర్థరాత్రివరకూ క్యాబరేలు చూసి మనసు మరింత రెచ్చిపోయేది.

ఇక లాభంలేదని రూమ్ బాయ్‌ని కదలేశాడు. వాడి పేరు రవీంద్ర.

"ఎందుకు దొరకరు సార్?" అని నవ్వాడు.

"ఈ రాత్రికి తీసుకు రాగలవా?"

తల వూపాడు రవీంద్ర.

"ఎంత?"

"వెయ్యి రూపాయలు. టాక్సీ ఫేర్ మీరే ఇవ్వాలి. రావడానికి పోవడానికి కూడా!"

సురేష్‌కి తల తిరిగింది.

"ఒక్క రాత్రికి వెయ్యిరూపాయలా?" ఆశ్చర్యపోతూ అన్నాడు.

రవీంద్ర సమాధానం చెప్పకుండా నవ్వి వెళ్ళిపోయాడు. హోటల్ రూమ్ రెంట్ భోజనం వగైరాలు కంపెనీ భరిస్తున్నది. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. కాని కాల్ గరల్ బిల్లు ఎవరిస్తారు? అందులో ఏభై కాదు, వందకాదు. వెయ్యి. తన నెల జీతంతో సమానం.

సురేష్ నీరసించి పోయాడు. మేనేజర్ పక్కగదిలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. సురేష్ బుక్ స్టాల్లో ఒక

సెక్స్ బుక్ కొనుక్కొని చదవసాగాడు. ఎంతకీ నిద్ర రావడంలేదు. రూమ్ బైటకొచ్చి వరండాలో పచార్లు చేయసాగాడు. చలిగాలి దంచి కొడుతున్నది. స్వెట్టర్ వేసుకున్నా చలిగానే వుంది.

రవీంద్ర డ్యూటీ దిగి వెళ్ళిపోతున్నాడు. హోటల్ యూనిఫారమ్‌లో లేడు.

"గుడ్ నైట్ సార్!" అన్నాడతను సురేష్‌ని చూసి.

"గుడ్ నైట్. డ్యూటీ అయిపోయిందా?"

తల వూపాడు రవీంద్ర. కొన్ని క్షణాలు ఆగాడు.

"సార్ మీరు ఫైవ్ స్టార్ హోటల్లో వుంటున్నారు. కాల్ గరల్ కోసం ఆ మాత్రం డబ్బు ఖర్చు పెట్టలేరా?"

సురేష్ నవ్వి "హోటల్ బిల్లు మా కంపెనీ చెల్లిస్తుంది. కాల్‌గరల్ బిల్లు నేను ఇవ్వాలి. నా జీతమే వెయ్యి. అంత డబ్బు ఒక్క రాత్రికి ఖర్చుచేస్తే నా గతి ఏమిటి?" అన్నాడు.

"సార్ ఒక ప్రైవేట్ కేసు వుంది. కాని ఆ అమ్మాయి హోటల్‌కి రాదు. మినిమమ్ రెండొందలు ఇవ్వాలి."

"ఎవరా అమ్మాయి?"

"మా ఇంటికి వెళ్ళే దార్లోనే వుంది. చాలా అందంగా వుంటుంది. బి.యస్సీ. చదువుతోంది."

"స్టూడెంట్ అన్నమాట."

"అవును సార్! చాలా బీదవాళ్ళు. ఆమెకు తల్లి లేదు. తండ్రి లారీ డ్రైవర్. యాక్సిడెంట్‌లో పోయాడు. ఒంటరిది. అప్పట్నుంచి జరుగుబాటులేక చదువుకుంటూనే చాలా సీక్రెట్‌గా వ్యవహారం జరుపుతోంది" అన్నాడు రవీంద్ర.

"అయితే నన్ను నీతో రమ్మంటావా?"

"రండి సార్!"

"ఆమె పేరు?"

"అనుపమ."

"సరే పద. ఆ అమ్మాయిని చూడాలని నాకు ఎంత గానో వుంది" అన్నాడు సురేష్.

ఇద్దరూ రోడ్డుమీదకు వచ్చారు.

రవీంద్ర ఆటో పిలిచాడు.

ఆటో దిగిన తర్వాత ఒక ఫర్లాంగు దూరం నడిచారు. అదంతా మురికివాడ ప్రాంతం. చిన్న చిన్న రేకుల ఇళ్ళు అక్కడక్కడా వున్నాయి. రవీంద్ర సురేష్‌ని ఒక స్ట్రీట్ లైట్ దగ్గరున్న కిళ్ళీకొట్టు దగ్గర ఆగమన్నాడు.

తను ఒక్కడే ఒక సందులోకి వెళ్ళాడు. పావుగంట తర్వాత తిరిగి వచ్చాడు. రమ్మని సైగ చేశాడు. సురేష్, రవీంద్రను అనుసరించాడు.

ఒక ఇంటిముందు ఆగారు. అదొక రేకుల షెడ్. తలుపు తీసేవుంది. డోర్ కర్టెన్ వ్రేలాడుతోంది.

"అనుపమా!" పిలిచాడు రవీంద్ర.

తెర చీల్చుకుని వచ్చింది అనుపమ.

"లోపలికి వెళ్ళండి" అన్నాడు రవీంద్ర.

సురేష్ లోపలకు వెళ్ళబోతుంటే "ఆమెకు రెండు వందలు ఇవ్వండి" అన్నాడు.

సురేష్ తల వూపాడు.

ముందు చిన్న గది వుంది. వంటపాత్రలు, పొయ్యి అన్నీ అక్కడే వున్నాయి.

లోపల మరొక గది వుంది. మధ్యలో తలుపులేదు. కర్టెన్ వుంది. సురేష్ లోపలకు వచ్చాక కర్టెన్ పూర్తిగా

వేసేసింది అనుపమ. ఆమెను చూస్తుంటే మురికివాడలో అమ్మాయిలా లేదు. అందంగా వుండడమే కాక ఖరీదైన చీర కట్టింది. నీట్‌గా టాయిలెట్ అయివుంది. ఆమె హిందీలోనే మాట్లాడింది.

"నీ పేరు అనుపమా?"

"అవును."

"బి.యస్సీ. చదువుకుంటున్నావటగదా!"

తల వూపింది.

సురేష్ తన గురించి చెప్పాడు. ఆమె మౌనంగా విన్నది. ఏమీ అడగలేదు.

తెల్లవారు జామున సురేష్ అక్కడ్నుంచి బైట పడ్డాడు.

మర్నాడు గూడా అతను అనుపమ దగ్గరకు వెళ్ళా లనుకున్నాడు. కాని మధ్యాహ్నమే తిరుగు ప్రయాణం కట్టాల్సి వచ్చింది.

సురేష్‌కి అదంతా యిప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆమె పేరు గూడా అనుపమే. రైలు యాక్సిడెంట్‌లో అనుపమ ఆ లారీ డ్రైవర్‌కి దొరికి వుంటుంది. పిల్లలులేని అతను అనుపమను పెంచుకుని వుంటాడు.

ఇదంతా నరేంద్రభూపతికి చెప్పాలి అనుకుంటూ హుషారుగా బయల్దేరాడు సురేష్.

3

నరేంద్ర భూపతి భవనంలోకి ప్రవేశించేటప్పటికి అతని ఆలోచనలు తారుమారయ్యాయి. తను అనుపమ వ్యభిచారిణిగా చూశానని చెప్తే ఆయన బాధపడతా డేమో? అటువంటి పిల్ల తన మనుమరాలని ఒప్పుకోవ డానికి ఆయన మనసు అంగీకరించదేమో? కాబట్టి తను

ఆమెను గురించి మరొక విధంగా చెప్పాలి అనుకున్నాడు.

"నమస్తే సార్!" అన్నాడు సురేష్.

"నువ్వా సురేష్! ఏమిటి విశేషాలు?" ప్రశ్నించాడు నరేంద్ర భూపతి.

"సార్! పాపను ఎక్కడ చూశానో గుర్తొచ్చింది."

"ఈజిట్?" ఆయన కళ్ళు మెరిశాయి. ముఖంలో ఆనందం కనిపించింది.

"ఢిల్లీలో చూశాను సార్! షుమారు ఒక సంవత్సరం దాటి వుంటుంది. వారం రోజులు ఆలోచించాక ఇప్పటికి గుర్తొచ్చింది."

"వెరీగుడ్ సురేష్!" అంటూ ఆయన సోఫాలోనుంచి లేచి వచ్చి అతని చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు.

ఆయన ఆనందం చూసి సురేష్‌కి ధైర్యం వచ్చింది. యజమాని ప్రక్కన మేనేజర్ సహితం కూర్చోగా తను చూడలేదు. అతడు రిజర్వ్‌డ్‌గా వుంటాడు. అటువంటి ఆయన తనను ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. అతనికి కించిత్తు గర్వం కలిగింది.

"ఇప్పుడు చెప్పు? అనుపమను ఎక్కడ చూశావు?"

"ఢిల్లీలో సార్!"

"అదే. ఢిల్లీలో ఎక్కడ?"

"సామ్రాట్ ఇంటర్నేషనల్ హోటల్ దగ్గర చూశాను. ఆమె నాకు యెందుకు గుర్తున్నదంటే ఆ దగ్గర్లోనే కాలేజీ వుంది. ఆ కాలేజీలో ఆమె చదువుతున్నట్లు వుంది. ఎవడో పోకిరీ కుర్రాడు ఆమెను ఏదో అన్నాడు. అంతే లాగి చెంపకాయ కొట్టింది. జనం మూగారు. అప్పుడు నేనక్కడే వున్నాను. ఆమె ధైర్యం

నాకు నచ్చింది. అందుకే నాకామె ముఖం గుర్తుంది."

సురేష్ ఒక కల్పిత కథ చెప్పాడు.

ముసలాయన ముఖంలో సంతృప్తి కనిపించింది.

"సంవత్సరం జరిగింది సార్ ఈ సంఘటన నేను చూసి. ఇప్పుడామె యెక్కడుందో? ఆ కాలేజీలో వున్నదో లేదో?"

"నువ్వు వెంటనే ఢిల్లీ వెళ్ళు. ఎన్నాళ్ళయినా వుండు. ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. నా మనవరాలిని నాకు చూపించు."

"అలాగే సార్!"

"కోట్ల రూపాయల ఆస్తికి ఇన్నాళ్టికి వారసురాలు దొరకబోతోంది. లేకపోతే ఈ సంపదంతా గుళ్ళకీ, ధర్మకార్యాలకూ ఇవ్వాల్సొచ్చేది" అన్నాడు నరేంద్ర భూపతి.

'కోట్లకొద్దీ ఆస్తి....' సురేష్ గొణుక్కున్నాడు.

4

సామ్రాట్ ఇంటర్నేషనల్ హోటల్లో దిగాడు సురేష్. స్నానంచేసి ఫ్రెష్‌గా తయారయ్యాడు. బార్‌లోకి వెళ్ళి చల్లటి బీర్ త్రాగాడు. ప్రయాణ బడలిక కొంచెం తగ్గినట్లు అనిపించింది.

అతను ఢిల్లీ చాలాసార్లు వచ్చినా, ఒంటరిగా రావడం ఇదే మొదలు. అందుకే అతనికి చాలా ఫ్రీగా వున్నట్లనిపించింది. కొంచెంసేపు లాన్‌లో కూర్చున్నాడు. రూమ్‌కి వెళ్ళి డిన్నర్ తెప్పించుకున్నాడు.

తర్వాత బేరర్ రవీంద్రను పిలిపించాడు.

అతను కుతూహలంతో వచ్చాడు.

"హల్లో మిష్టర్ రవీంద్రా! బాగున్నావా?" అంటూ

నవ్వుతూ పలకరించిన సురేష్‌ని విస్తుపోతూ చూశాడు.

"మీరు....మీరు...." రవీంద్ర అతన్ని గుర్తుపట్టలేక పోయాడు.

"నేను గుర్తు లేనన్నమాట. ఇలా వుంటానులే? ఎప్పుడో సంవత్సరం క్రితం చూశావు. రోజూ ఎందర్నో చూస్తుంటావు. గుర్తుండడం కష్టం."

"సార్!....మీరెవరో నాకు తెలియడంలేదు. నన్ను వెంటనే కలుసుకోమని చెప్పారట....!"

"అవును. నేను పొరబడడంలేదు. నేను నీకోసమే హైదరాబాద్‌నుంచి ఢిల్లీ వచ్చాను" నవ్వుతూ అన్నాడు సురేష్.

"నాకోసం అంత దూరంనుంచి వచ్చారా?" రవీంద్ర మరింత ఆశ్చర్యపోతూ అన్నాడు.

"అవును. అలా ఆశ్చర్యపోకు. ముందు కూర్చో!" అన్నాడు.

"ఫరవాలేదు సార్!" ఇబ్బందిగా అన్నాడు రవీంద్ర.

"అలా కాదు. కూర్చో!"

"సారీ సార్! నేను డ్యూటీలో అలా కష్టమర్ల ముందు కూర్చోగూడదు. మా హోటల్ రూల్స్ ఒప్పుకోవు. ఎవరైనా చూస్తే ఉద్యోగం కాస్తా వూడుతుంది."

సురేష్ డోర్ లాక్ చేసి వచ్చి, రవీంద్రను బలవంతాన కూర్చోబెట్టాడు.

"నువ్విప్పుడు సర్వర్‌వి, నేను కష్టమర్నికాదు. అదంతా కాసేపు మర్చిపో. నేను నీ సహాయంకోసం వచ్చాను."

"నా సహాయమా?"

"అవును మిష్టర్ రవీంద్రా!"

"చెప్పండి."

"సంవత్సరం క్రితం నేను ఇదే హోటల్లో పనచేశాను. అఫ్‌కోర్స్ అప్పుడు నాతోపాటు మా మేనేజర్ గూడా వున్నాడనుకో."

రవీంద్ర గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఒకరోజు నన్నొక కాలేజీ అమ్మాయి ఇంటికి తీసి కెళ్ళావు. ఆమె పేరు అనుపమ."

"అనుపమా?"

"అవును."

రవీంద్రకు గుర్తొచ్చింది.

"అవును. గుర్తొస్తోంది."

"అనుపమ కావాలి నాకు. పిలిపించు ఈ రాత్రికి" అన్నాడు సురేష్.

రవీంద్ర పెదవి విరిచాడు.

"సారీ సార్."

"ఏం?"

"ఆమెకి పెళ్ళయిపోయింది."

"వాట్....?" సురేష్ అరిచాడు.

"అవును సార్! ఆమె పెళ్ళిచేసుకుంది."

వునూరు మన్నాడు సురేష్.

"పెళ్ళిచేసుకున్నాక ఆమె రావడం లేదా?"

"లేదు సార్! ఇప్పుడా ఇంట్లోనే వుండడంలేదు. అది అమ్మనీ మేనమామ వెంట వెళ్ళిపోయింది."

"అతను ఏం పని చేస్తాడు."

"డి.సి.యమ్.లో వాచ్‌మాన్."

"చదువుకున్న అమ్మాయి అతన్ని ఎలా పెళ్ళిచేసు కుంది?"

"పరిచితులు సార్!"

"అతను ఎలాంటివాడు?"

"వాడుట్టి వెధవ సార్!"

"డబ్బుకోసం అనుపమను హోటల్‌కి పంపిస్తాడా?"

"తెలీదు సార్! అది కాదు సార్! వాడుట్టి తాగుబోతు."

"ఎన్నేళ్ళుంటాయి?"

"నలభై దాటి వుంటాయి. ఇది మూడో పెళ్ళి వాడికి."

"అయితే అనుపమ ఇష్టం లేకుండానే ఈ పెళ్ళి చేసుకుని వుంటుంది."

"అంతే సార్!"

"అనుపమను ఒకసారి కలుసుకోవాలి. నా కోసం ప్రయత్నించగలవా?"

రవీంద్ర కొంచెంసేపు మాట్లాడలేదు.

"నీకు కావాల్సిన డబ్బు ఇస్తాను."

"అందుకు కాదు సార్! ఇక ఎవర్నీ తీసుకురావద్దని, ఆ జీవితం మానేశాననీ చెప్పింది సార్!" అన్నాడు రవీంద్ర.

సురేష్ నవ్వాడు.

"అది ఆర్నెల్ల క్రితం మాట. ఇప్పుడు ఆమె మనసు మారి వుండొచ్చుగదా! అయినా ప్రయత్నించడంలో నష్టం ఏమిటి? నేను కేవలం ఒక రాత్రి గడపడానికి మాత్రమే రాలేదు."

"మరి?"

"నాకు అదృష్టం కలిసొచ్చి పాతిక లక్షలు లాటరీ తగిలింది. సినిమా తియ్యాలని బుద్ధి పెట్టింది. అనుపమ

అందం నన్ను ఆకర్షించింది. ఆమెను హీరోయిన్ చెయ్యాలని సంకల్పించాను. అందుకే ఇంత ఆరాటం. నువ్వేమంటావు? అనుపమ అందంగా వుంటుంది కదూ!"

రవీంద్ర ఆశ్చర్యంనుంచి కోలుకోలేదు.

"మీరు సినిమా తీస్తున్నారా....?"

"అవును. ఏం....?"

"ఏం లేదు సార్! అనుపమ సినిమాల్లో పనికిరాదు సార్!"

"ఏం?"

"ఆమె బిడియస్తురాలు. మాట్లాడ్డానికే యెంతో మొగమాట పడుతుంది. పిరికి మనిషి."

సురేష్ నవ్వాడు.

"మొదట్లో అంతా అలాగే వుంటారు. ప్రాక్టీస్‌లో మామూలుగా యాక్ట్ చేసేస్తారు. అదంతా నేను చూసుకుంటాను. అనుపమ నన్ను కలుసుకునే ఏర్పాటు చెయ్యి చాలు" అన్నాడు సురేష్.

సూట్‌కేస్ తెరచి రెండుకందల కాగితాలు రవీంద్ర చేతిలో పెట్టాడు.

"ఇది అడ్వాన్స్ మాత్రమే" అని చిరునవ్వు నవ్వాడు.

5

రవీంద్ర తలుపు తట్టాడు.

అనుపమ తలుపు తెరిచింది. అతన్ని చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిటిలా వచ్చావు?" అంది.

"నీతో పనుండి వచ్చాను. లోపలకు రానివ్వవా

ఏమిటి? గుమ్మంలోనే నిలబెట్టి మాట్లాడుతున్నావు."

"ఆదేంలేదు. కిషన్‌కి తెలిస్తే పెద్ద గొడవ" అంది విసుగ్గా.

"కిషన్ వెళ్ళేవరకూ ఆ మూల చెట్టుకింద నిల్చుని వచ్చాను. ఎలా తెలుస్తుంది? మళ్ళీ రేపు ఉదయమేగా డ్యూటీనుంచి వచ్చేది?"

"తెలియడానికేముంది? అతనే చూడాలా? ఇరుగు పొరుగువాళ్ళు ఎవరైనా చెప్పొచ్చు" అంది.

రవీంద్ర ఇల్లంతా కలయజూశాడు. ఒక గదిలోనే సంసారం. దరిద్రం తాండవిస్తోంది ఇంట్లో. అనుపమగూడా ఈ ఆర్నెల్లలో ఎంతో చిక్కిపోయినట్లు కనిపిస్తోంది. ఆమె కళ్ళల్లో దిగులు గూడు కట్టుకుంది.

అతను లోపలకు వచ్చాక ఆమె తలుపు మూసింది.

"చాలా చిక్కిపోయావు అనుపమా?" అన్నాడు ఆప్యాయంగా.

ఆమె సమాధానం చెప్పలేదు. నవ్వి వూరుకుంది.

"సరిగా తిండిగూడా తినడం లేదా?"

"తినడానికేముంది? జీతంలో ముప్పాతిక భాగం అతని తాగుడుకే సరిపోతుంది."

"ఏదైనా జాబ్‌కి ట్రై చెయ్యక పోయావా?"

"పోస్టుగ్రాడ్యుయేట్స్‌కే దిక్కులేదు. కనీసం డిగ్రీ గూడా పూర్తిచేయని నా కెవరిస్తారు జాబ్" అంది విరక్తిగా.

కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి అసలు విషయంలోకి వచ్చాడు రవీంద్ర.

"సంవత్సరం క్రితం సురేష్ అని ఒక వ్యక్తి ఒక రాత్రి నీతో గడిపి వెళ్ళాడు."

"అయితే?"

"అతను మళ్ళీ వచ్చాడు ఇవ్వాళ్టికి. మా హోటల్లోనే రూమ్ తీసుకున్నాడు. గమ్మత్తు ఏమిటో తెలుసా? అతను హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చింది నీ కోసమే నట."

అనుపమ ఆశ్చర్యంగా చూసింది.

"నిన్ను చూడాలని చచ్చిపోతున్నాడనుకో."

"చెప్పకపోయావా? మా నేశానసీ, పెళ్ళయిందనీ."

"అన్నీ చెప్పాను."

"సారీ రవీంద్రా! నేను రాలేనని చెప్పు."

"అనుపమా బాగా ఆలోచించుకో. అతను వచ్చింది నీ దగ్గర సుఖం పొందడానికి కాదు. నీ అందం అతనికి నచ్చిందట. లాటరీలో పాతిక లక్షలు వచ్చాయట. నిన్ను హీరోయిన్ చేసి సినిమా తీస్తాడట."

అనుపమ పకపకా నవ్వింది.

"అతనెవరో పిచ్చివాడిలా వున్నాడు."

"కావచ్చు."

"దేశం గొడ్డుపోయిందా? నాకంటే అందగత్తెలు ఎందరో వున్నారు."

"వుంటే వుండొచ్చు. అదృష్టం అందరికీ కలిసిరాదు."

"అదృష్టం సంగతి అలా వుంచు. నేను నటనకు పనికి రాను. నలుగుర్లో తిరగడమే నాకు సిగ్గు."

"అదంతా అతను చూసుకుంటాడు. ప్రాక్టీస్ మీద వచ్చేస్తుందని చెప్పాడు."

"అతని మాటలన్నీ నిజమని నమ్ముతున్నావా? సినిమా హీరోయిన్ చేస్తానని నమ్మించి బొంబే తీసికెళ్ళి ఏ బ్రోతల్ హౌస్‌కో అమ్మేస్తే?"

"అతను అలాంటివాడని అనుకోకు. అలా మోసం చెయ్యదలిస్తే నీ దగ్గరికే రావాలని ఏముంది? ఆ గ్లామర్ వున్న వాళ్ళు ఎందరో దొరుకుతారు."

అనుపమ మాట్లాడలేదు కొంతసేపు. ఏదో ఆలోచిస్తూ గడిపింది.

"అనుపమా! అదృష్టం నీ తలుపు తట్టింది. కాదనకు."

"రవీంద్రా! నావల్ల కాదు ఆ సినిమాల్లో యాక్టు చెయ్యడం. అతనికి ఆ సంగతి చెప్పు." నిష్కర్షగా అంది.

రవీంద్ర ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. ఆమె వినలేదు.

6

సినిమా హీరోయిన్ చేస్తానని ఆశపడితే ఎగిరి గంతేస్తుందని తలపోసిన సురేష్ అనుపమ ఒప్పుకోలేదని వినే సరికి షాక్ తిన్నాడు.

"సార్! మీ పిచ్చిగాని అనుపమకంటే అందగత్తెలు ఎక్కడా దొరకరా? పేపర్లో ఒక ప్రకటన ఇవ్వండి చాలు. మీ గదిముందు క్యూలో నిల్చుంటారు హీరోయిన్లు" రవీంద్ర నవ్వాడు.

"నా పిచ్చి నాకు ఆనందం" అన్నాడు సురేష్.

"సార్! నేను వెళ్ళొస్తాను. డ్యూటీ అయిపోయింది" అన్నాడు రవీంద్ర.

"మిస్టర్ రవీంద్రా! నాకు అనుపమ ఇల్లు చూపించ గలవా?"

"నాకు ఏమీ అభ్యంతరం లేదు. కాని...."

"కాని....ఏమిటి?"

"అ ను ప మ మొగుడు కిషన్ గాడుట్టి మూర్ఖుడు.

మిమ్మల్ని చూస్తే ఏమైనా వుందా? అసలే తాగివుంటాడు ఎప్పుడూ!"

"ఫరవాలేదు. నేను అతన్ని మేనేజ్ చేస్తాను" అన్నాడు సురేష్.

ఇద్దరూ హోటల్ దాటి రోడ్డుమీదకు వచ్చారు. ఆటోలో ఎక్కారు.

రవీంద్ర అనుపమ ఇల్లు చూపించి వెళ్ళిపోయాడు.

తలుపు తీసేవుంది.

సురేష్ చొరవగా లోపలకు వెళ్ళాడు.

అనుపమ అతన్ని చూసి భయపడింది.

"ఎవరు మీరు?" అంది.

"నా పేరు సురేష్. రాత్రి రవీంద్ర నీకు అంతా చెప్పేవుంటాడు."

"అఁ— చెప్పాడు. కాని నాకు ఇష్టంలేదు. ఆ సంగతి ఖచ్చితంగా చెప్పాను. మళ్ళీ మీరెందుకు వచ్చారు? దయచేసి వెళ్ళిపోండి. నా భర్త వచ్చే వేళయింది" భయం భయంగా అంది ఆమె.

"భయపడకు అనుపమా! నేను రవీంద్రకు చెప్పినవన్నీ అబద్ధాలే."

"ఏమిటీ?"

"అవును. నేను అతనికి నిజం చెప్పలేదు. సినిమా తియ్యడం, నిన్ను హీరోయిన్ చెయ్యడం అంతా నిన్నెలాగైనా నా దగ్గరకు రప్పించుకోవాలని అలా చెప్పాను."

"ఇక నాతో ఏం పని? నేను అవన్నీ మానేశాను. నాకు పెళ్ళయింది."

"అయితే అయింది. అనుపమా! నేను చెప్పే విషయం

జాగ్రత్తగా విను. ఇది చాలా సీక్రెట్. ముందు తలుపు వేసిరా” అన్నాడు.

ఆమె తలుపు గడియ పెట్టి వచ్చింది.

“అనుపమా నువ్వు నీ తల్లిదండ్రులుగా భావించిన వారికి పుట్టలేదు.”

అనుపమ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది.

“నువ్వు కోటీశ్వరుల బిడ్డవు. రైలు ప్రమాదంలో నీ తల్లిదండ్రులు చనిపోయారు. నిన్ను ఒక లారీ డ్రైవర్ పెంచుకున్నాడు. అప్పుడు నీ వయస్సు పదేళ్ళు వుండొచ్చు. జ్ఞాపకం తెచ్చుకో....”

అనుపమ చిన్ననాటి సంగతులు జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

సురేష్ జరిగిన కథంతా చెప్పాడు. ఆమె తాత నరేంద్ర భూపతి కోట్లు సంపాదించాడనీ, ఆ సంపదకు ఆమె ఏకైక వారసురాలనీ నిజం చెప్పేసరికి అనుపమకు మతిపోయింది.

“నా మాట విను. నీ భర్తని వదిలించుకుని నాతో వచ్చేసెయ్! నీకింకా పెళ్ళి కాలేదని మీ తాతతో చెప్తాను. ఆయన ఎంతో సంతోషిస్తాడు. లేకపోతే ఈ తాగుబోతు వాడినీ, వయసు మళ్ళినవాడినీ చూసి ఆయన అసహ్యించుకోవచ్చు” అన్నాడు సురేష్.

సురేష్ చెప్పేమాటలు వింటుంటే ఆమెకు అరచేతిలోనే స్వర్గం కనిపించింది. సినిమాలలో చూసే బ్రహ్మాండమైన సెట్టింగ్ లాంటి భవనం, కారు, నగలు ఆ వైభవం కళ్ళకు కట్టింది. ఆ సంపద అనుభవించాల్సిన తను తిండికి గతిలేక, మూడో పెళ్ళి తాగుబోతుతో జీవితం గడుపుతోందా? ఛీ....అనిపించింది.

"కాని అతన్ని వదిలించుకోవడం ఎలా?" అంది.

"నువ్వు నాతో రావడానికి ఒప్పుకో చాలు. అదంతా నేను చూసుకుంటాను."

"కిషన్ సంగతి మీకు తెలీదు. ఎంత డబ్బిచ్చి వది లించుకున్నా వదలడు. జీవితాంతం నన్ను బ్లాక్ మెయిల్ చేస్తాడేమో!"

"అతను వుంటేగదా బ్లాక్ మెయిల్ చెయ్యడానికి?"

"అంటే?"

"మర్డర్."

అనుపమ గుండె దడదడలాడింది సురేష్ మర్డర్ అనగానే.

7

కిషన్ థ్యాటర్నుంచి దిగేటప్పటికి పది దాటింది. అప్పట్నుంచి బస్ కోసం ఎదురుచూస్తున్నాడు. బస్‌లు వస్తున్నాయి, పోతున్నాయి. అన్నీ కిటకిటలాడు తున్నాయి. జనం ఫుట్‌పాతులమీదే నిలబడి పోతు న్నారు.

కిషన్ కడుపులో మంటగా వుంది. ఉదయం క్యాంటీన్‌లో తిన్న రెండు పూరీలు ఒక మూలకిరాలేదు. కనీసం పదికిలోమీటర్లయినా పోవాలి బస్‌లో. బస్ దొరికిపోయేటప్పటికి పన్నెండవుతుంది. అతనికి విసుగ్గా వుంది. జేబులో రూపాయి కాగితం గూడా లేదు. పెలాఖరు. రాత్రి మందు లేకపోవడంవల్ల పిచ్చెక్కి పోయి నట్టుంది.

"కిషన్ భాయ్ !" అంటూ భుజంమీద ఎవరిదో చేయి పడేటప్పటికి వులిక్కిపడ్డాడు.

అతను టోపీ పెట్టుకున్నాడు. నల్ల కళ్ళద్దాలు.

లాల్చీ, పైజామా వేసుకున్నాడు.

కిషన్ ఆశ్చర్యంగా చూశాడు. ఎవరో గుర్తు రావడం లేదు.

"బాగున్నావా?" అన్నాడు అతనే మళ్ళీ.

"ఎవరు మీరు?" అన్నాడు కిషన్.

"అరె భాయ్ నన్నే గుర్తుపట్టలేదా! భలేవాడివే. డి.సి.యమ్.లో పనిచేసేవాడిని. నాలుగేళ్ళక్రితం మానేసి సౌదీ అరేబియా వెళ్ళిపోయాను."

కిషన్‌కి అతనెవరో చచ్చినా గుర్తురావడంలేదు. కాని అలా అంటే బాధపడతాడేమోనని పొడిగా నవ్వి "నువ్వా భాయ్!" అన్నాడు.

"గుర్తుపట్టావు కదా! హమ్మయ్య పద అలా బార్ కెళ్ళి బీర్ కొడదాం. ఎవరూ తోడు దొరక్క చస్తున్నాను. ఒక్కడ్నే మందు కొట్టే అలవాటులేదు నాకు. ఎండ దంచేస్తోంది కదూ!" అన్నాడు అతను.

కిషన్‌కి బ్రహ్మానందం కలిగింది. ఏదెవడో గుర్తు రావడం లేదుగాని సమయానికి దేవుళ్ళా వచ్చాడు. రాత్రి మందు కొట్టకపోయేసరికి నాలిక పీక్కుపోతోంది.

ఏ.సి. బార్‌కి వెళ్లారు ఇద్దరూ.

"భాయ్! ఏమీ అనుకోకు. నీ పేరు గుర్తు రావడం లేదు" అన్నాడు కిషన్.

అతను పకపక నవ్వి "అవునులే ఎలా గుర్తుంటుంది. నేను ఆఫీసులో పనిచేసేవాడిని. నువ్వేమో ఫీల్డులో. అదీగాక నాలుగేళ్ళు దాటింది" అన్నాడు.

కిషన్ ఇబ్బందిగా కూర్చున్నాడు.

"నా పేరు సరే. నా ముఖమైనా గుర్తొచ్చిందా లేదా?"

"భలే వాడివే" అని నవ్వాడు కిషన్.

"నా పేరు రామ్‌లాల్" అన్నాడు.

చల్లటి బీర్ బాటిల్స్ టేబుల్ మీదకు వచ్చాయి. రామ్‌లాల్ గ్లాసుల్లోకి వంచి ఛీర్స్ చెప్పాడు.

చల్లటి ద్రవపదార్థం గొంతులోకి దిగుతుంటే స్వర్గంలో తేలుతున్నట్లుంది కిషన్‌కి. ఎత్తిన గ్లాసు దించకుండా ఖాళీ చేశాడు.

"నీకు సారాయి అలవాటు. బీర్ ఏమి ఆనుతుందిలే. మరో బాటిల్ తెప్పించనా?" అన్నాడు రామ్‌లాల్.

"వద్దు భాయ్" మొగమాట పడుతూ అన్నాడు కిషన్.

"భలేవాడివే. నా దగ్గర సిగ్గుపడకు" అన్నాడు.

మరో రెండు బాటిల్స్ వచ్చాయి.

కిషన్ గ్లాసు ఖాళీ అవుతూ వుంటే రామ్‌లాల్ నింపుతున్నాడు.

"ఇక్కడ నౌకరీ మానేసి సౌదీ అరేబియా వెళ్ళి పోయాక దరిద్రం వదిలింది భాయ్. ఈ నాలుగేళ్ళలో ఖర్చులు పోను రెండు లక్షలు మిగిలాయి."

"నిజం?" అన్నాడు కిషన్.

"అబద్ధం చెప్పాల్సిన పనేముంది?"

"అట్టే అదేం కాదు. అంతంత జీతాలిస్తారా అక్కడ?"

"మరేమనుకున్నావ్?"

"పోనీలే. బాగుపడిపోయావ్. ఇక్కడే వుంటావా?"

"ఎందుకు దరిద్రం. ఎల్లుండి వెళ్ళిపోతున్నాను. నెల సెలవు పెట్టి వచ్చాగాని ఇక్కడేం తోచడంలేదు."

"అలాగా?"

"ఏం నువ్వూ వస్తావా?"

"నేనా?"

"అవును భాయ్! వచ్చేయ్. ఇక్కడ ఎన్నాళ్ళున్నా గాజుల బేరం కూటికి సరి. మిగిలేదీ చచ్చేదీ లేదు."

"నన్ను తీసికెళ్తావా? వీలవుతుందంటావా?" ఆశగా అడిగాడు కిషన్.

"ఎందుకు వీలు కాదు. నాకు అక్కడ కొంచెం పలుకుబడి వుందిలే. నీకు ఏదోక నౌకరీ చూస్తాను."

"ఆ పుణ్యం కట్టుకో రామ్‌లాల్ భాయ్. నీ పేరు చెప్పుకుని బాగుపడిపోతాను" అన్నాడు కిషన్.

"అలాగే మరి నాకేమిస్తావు?"

"ఏం కావాలి?" అన్నాడు కిషన్.

రామ్‌లాల్ పకపక నవ్వి "నీ దగ్గరేముంది చిప్ప ఇవ్వడానికి. నీ సంగతి నాకు తెలీదా? సరదాగా అడిగాను. ఏమీ వద్దుగాని రాత్రికి పార్టీ ఇవ్వు" అన్నాడు.

"పార్టీయా?" కిషన్ గతుక్కుమన్నాడు. సెలాఖరు. జేబులో డబ్బు లేదు. అప్పిచ్చే నాధుడు లేడు.

"ఇదుగో ఈ డబ్బు నీ దగ్గరుంచు. బాభీతో చెప్పి దమ్‌కా ముర్గీ చేయించు. నేను వచ్చేటప్పుడు 'ఏ' క్లాస్ బ్రాందీ తెస్తాను" అన్నాడు రామ్‌లాల్.

రెండువందల కాగితాలు కిషన్ జేబులో కుక్కాడు.

"వద్దులే. భలేవాడివి భాయ్" అన్నాడు కిషన్.

"నా దగ్గర డబ్బు మూలుగుతూ వుంది. నీ దగ్గర పైసా లేదు. ఆ మాత్రం గ్రహించలేననుకున్నావా?"

ఇద్దరూ బార్‌లోనుంచి బైటపడ్డారు.

ఆటో పిలిచాడు రామ్‌లాల్.

"ఎందుకూ బస్‌లో పోదాం."

"ఛీ....బస్‌లో వెళ్ళే అలవాటు లేదు" అన్నాడు రామ్‌లాల్.

"మీ ఇంటికి దారి చెప్పు. నిన్ను వదిలేసి నేను పోతాను."

కిషన్ తన ఇంటికి దారి చూపించాడు ఆటో డ్రైవర్‌కి.

ఆటో కిషన్ ఇంటిముందు ఆగింది. కిషన్ దిగాడు. రామ్‌లాల్ దిగలేదు. కిషన్ దిగి భోజనంచేసి వెళ్ళమని బలవంతం చేశాడు. అతను ఒప్పుకోలేదు. రాత్రి తొమ్మిది దాటాక వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు ఆటోలో.

8

కిషన్ ముఖం చిటపటలాడుతూ వుంటుంది మామూలుగా. ఈ రోజు ఎందుకో సంతోషంగా వున్నాడు. హుషారుగా వచ్చాడు ఇంట్లోకి.

"అతను ఎవరు?" ప్రశ్నించింది అనుపమ.

"నా దోస్తు. మా మిల్లులోనే పనిచేసేవాడు. నాలు గేళ్ళక్రితం నౌకరీ మానేసి సౌదీ వెళ్ళిపోయాడు. రెండు లక్షలు మిగిలిందట" అంటూ రామ్‌లాల్ తనను గూడా తీసికెళ్తానన్న విషయం చెప్పాడు.

తర్వాత హడావుడిగా మార్కెట్‌కి వెళ్ళి కోళ్ళు పట్టుకొచ్చాడు. రామ్‌లాల్ భోజనానికి వస్తున్నాడని పదే పదే చెప్పాడు. అనుపమ ఏడుగంటలకల్లా అన్నీ సిద్ధంచేసింది. ఆటోరిక్షా వస్తున్న శబ్దంకోసం చెవులు రిక్కించుకుని కూర్చున్నాడు కిషన్.

రాత్రి తొమ్మిదింటికి వచ్చాడు రామ్‌లాల్. ఆటోలో రాలేదు. నడిచే వచ్చాడు. చేతిలో అట్టప్యాకెట్ వుంది.

అది ఫుల్ బాటిల్.

"రా భాయ్! ఇంత ఆలస్యం చేశావేం?" అంటూ ఆహ్వానించాడు కిషన్.

ఇద్దరూ కూర్చున్నారు.

అన్నీ సిద్ధంచేసి ఒక మూల నిల్చుంది అనుపమ.

రామ్‌లాల్ తను నామమాత్రం గొంతులో పోసుకుంటూ అంతా కిషన్‌తోనే త్రాగించాడు. పదకొండు గంటలకు కిషన్ పని అయిపోయింది.

మత్తులోకి జారిపోయాడు.

రామ్‌లాల్ నవ్వుతూ అనుపమ దగ్గరికి వచ్చి భుజం మీద చేతులువేశాడు. ఆమె భయంతో గోడకు కరుచుకు పోయింది.

"నన్ను గుర్తుపట్టలేదా?" అంటూ టోపీతీశాడు.

"మీరా! సురేష్?" ఆశ్చర్యంగా అంది.

"నేనే! ఎలా వుంది నా వేషం?"

ఆమె ఆశ్చర్యంనుంచి తేరుకోలేదు.

"ఇక వీడు లేవడు. తెల్లవారి నువ్వు ఏడ్చి మొత్తుకుని గోడవ చెయ్యి. శవాన్ని పూడ్చడానికి ఇదుగో ఈ డబ్బు వుంచు" అంటూ ఆమె చేతిలో కొంత డబ్బు వుంచాడు.

"ఏమిటి? చనిపోయాడా?" భయంగా అంది.

"ఇంకా లేదు. కాని చస్తాడు. జాగ్రత్తగా విను. నేను స్ప్రామాట్ హోటల్ నుంచి మారిపోయాను. అశోక్ హోటల్ రూమ్ నెంబర్ 171. మూడో రోజున రాత్రికి నువ్వు రావాలి. నేను హైదరాబాద్‌కి బెర్తులు రిజర్వుచేసి వుంచుతాను. ఏం?"

ఆమె తల వూపింది.

సురేష్ జేబులోనుంచి సిరంజితీసి చిన్న బాటిల్‌నుంచి మందు ఎక్కించి కిషన్ జబ్బలో గుచ్చాడు. కిషన్ కొంచెం కదిలాడు.

"ఇక వీడి పని అయిపోయినట్లే. నేనిక వస్తాను. చెప్పినవన్నీ జాగ్రత్త!" అన్నాడు సురేష్.

తర్వాత వీధిలోకి వెళ్ళిపోయాడు.

9

అనుపమ హోటల్ గదిలోకి వచ్చింది.

"హమ్మయ్య! వచ్చావు కదా! వస్తావో రావోనని టెన్షన్‌తో చస్తున్నాను" అన్నాడు సురేష్.

ఆమె నవ్వింది.

సురేష్ ఆమెకోసం తెచ్చిన ప్యాకెట్లన్నీ విప్పాడు. రకరకాల చీరలు, బ్లౌజులు, బ్రాలు, నగలు. సమస్తం వున్నాయి.

"చూడు అనుపమా! నువ్విప్పుడు పాత అనుపమవు కాదు. సరికొత్త రూపం ధరించాలి. నీకింకా పెళ్ళి కాలేదు. గుర్తుంచుకో మిస్ అనుపమా! నువ్వు కోటీశ్వరుడి ఏకైక వారసురాలివి. గతమంతా మర్చిపో" అన్నాడు.

అనుపమ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి స్నానం చేసింది. అన్నీ అలంకరించుకుంది. ఆమె రూపం పూర్తిగా మారి పోయింది.

"వెరీ గుడ్!" అన్నాడు సురేష్ సంతృప్తిగా తల ఆడిస్తూ.

ఒక వాచ్‌మాన్‌గాడి పెళ్ళాం క్షణాలలో కోట్లకు అధిపతి కాబోతోంది. ఎంత విచిత్రం? నరేంద్ర భూపతి మనుమరాలిని చూసి ఎంత సంతోషిస్తాడో?

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది ఆమె.

"ఏం లేదు. నిన్ను చూడగానే మీ తాతగారి రియాక్షన్ ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"చాలా ఆనందిస్తాడనుకుంటాను" అంది.

"ఆనందంతో మూర్ఛపోతాడు."

ఆమె నవ్వింది.

"జీవితం ఎంత విచిత్రమైంది అనుపమా? యెప్పుడో సంవత్సరం క్రితం శారీరకమైన కోర్కె తీర్చుకోవడానికి నీ దగ్గరకు వచ్చాను. నీ రూపం నా మదిలో ముద్రపడి పోయింది. నీ చిన్నప్పటి ఫోటో చూసి గుర్తించగలిగాను. నా జ్ఞాపకశక్తివల్ల నువ్వు కోట్లకు అధిపతివి కాబోతున్నావు."

అనుపమ కృతజ్ఞతాపూర్వకంగా చూసింది అతన్ని.

"ఇక నీ జీవితం ఎంత మారిపోతుంది? కాలు భూమి మీద పెట్టనవసరంలేదు. పట్టుచీరలే తప్ప నూలుచీరలు ముట్టుకునే పనేలేదు. వజ్రాల నగలు, బంగారు గాజులు, చిటికవేస్తే నౌకర్లు, కార్లు, విమానాలలో ప్రయాణం.... ఓహ్! ఎంత వైభవంగా వుంటుందో....?"

అనుపమకు అవన్నీ కళ్ళముందు సినిమా రీళ్ళలా కదులుతున్నాయి.

"అనుపమా....!" సురేష్ ఆమె దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేశాడు.

"వూఁ...." అంది ఆమె.

"ఇప్పుడు ఎంత అందంగా వున్నావో తెలుసా? నిన్నెవరూ గుర్తించలేరు. అంత మారిపోయావు. డబ్బు మనిషి రూపాన్ని ఎలా మార్చేస్తుందో నిన్ను చూస్తే తెలుస్తోంది" అన్నాడు.

ఆమెకు ఏం చెప్పాలో తోచడంలేదు.

"నిన్నా మురికి కూపంనుంచి బైటపడేసి రక్షించాను. నిన్ను మహారాణిని చేశాను. మరి ప్రతిఫలంగా నాకేమి ఇస్తావు?"

ఆమె సురేష్ కళ్ళల్లోకి చూసింది. అతని కళ్ళల్లో కాంక్ష బుసలు కొడుతోంది. అతని మనసు తనను కోరుతోంది.

"మీకేం కావాలి?"

"నీ ప్రేమ!" అన్నాడు సురేష్.

ఆమె వులిక్కిపడింది.

"అవును అనుపమా! నన్ను ప్రేమించలేవా?"

"సురేష్! నా జీవితం మీకు తెలుసు. డబ్బుకోసం శరీరాన్ని అమ్ముకున్నాను. గతిలేక మూడో పెళ్ళి తాగుబోతుతో సంసారం చేశాను. అన్నీ తెలిసి నన్ను ప్రేమిస్తారా? నా గురించి ఏమీ తెలియకపోతే ఆ విషయం వేరు" అంది ఆమె.

"అదంతా గతం అనుపమా! పొరపాటున కూడా గుర్తు తెచ్చుకోకు. నీకు గతంలేదు. భవిష్యత్తు మాత్రమే వుంది."

సురేష్ ఆమెను గాఢంగా తన కౌగిలిలో బంధించాడు.

'అదృష్టమంటే తనదే. కోటీశ్వరుడి ఏకైక వారసురాలు తన గుప్పిట్లో వుంది' అనుకున్నాడు.

గర్వంలో అతని ఛాతీ పొంగింది.

10

నరేంద్ర భూపతి భవనాన్ని దిగ్భ్రాంతితో చూస్తోంది అనుపమ. ఆమె మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

సురేష్ ఆమెకు స్వాగతం చెప్తూ ఒళ్ళో కళ్ళు అడుగే వేయిస్తూ లోపలకు తీసికెళ్ళాడు.

నరేంద్ర భూపతి ఆఫీస్ రూమ్‌లో కూర్చున్నాడు. అనుపమను తీసికెళ్లాడు సురేష్.

"సార్! ఇదుగో మీ మనుమరాలు" మెరుస్తున్న కళ్ళతో అన్నాడు.

నరేంద్ర భూపతి అతన్ని చేతితో సైగ చేశాడు బైటకు వెళ్ళిపొమ్మని. సురేష్ మనసు చివుక్కుమంది. తను ఎంతో కష్టపడి ఆమెను తీసుకొచ్చాడు, ఎంతో రిస్క్ చేశాడు. ఆఖరికి హంతకుడిగా గూడా మారాడు. ఆ ముసలాయనకి ఏ మాత్రం కృతజ్ఞత లేదే!

అతను చివ్వున గది బైటకు వచ్చాడు.

సురేష్ వెళ్ళిపోయాక నరేంద్ర భూపతి అనుపమ కళ్ళల్లోకి సూటిగా చూశాడు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఆమెకు గుండెలో రైళ్ళు పరిగెడుతున్నాయి. భయంతో శరీరం వణుకుతోంది.

నరేంద్ర భూపతి కుర్చీలోనుంచి లేచి నెమ్మదిగా దగ్గరకు వచ్చాడు. ఆమె భుజంమీద చేతులు వేశాడు.

"అమ్మా నీ పేరేమిటి?"

"అనుపమ" ఆమె పెదవులు వణికాయి.

భూపతి ఆమె బ్లౌజును స్పర్శన చించాడు. ఆమె బిత్తరపోయింది. ఆమె వీపు తదేకంగా చూశాడు. లేత రంగులో గుండ్రటి పుట్టు మచ్చ కనిపించింది. ఆయన మనసు పులకించి పోయింది.

"అమ్మా! అనుపమా! నువ్వేనమ్మా నా తల్లివి" అంటూ కౌగలించుకున్నాడు ఆమెను.

తర్వాత గది బైటకు వచ్చాడు. వస్తూనే అక్కడ

అసహనంగా పచార్లు చేస్తున్న సురేష్‌ని గాగమనించు తున్నాడు.

"సురేష్ నా మనుమరాలిని నాకు తెచ్చి ఇచ్చావు. నీకేమి ఇచ్చినా ఋణం తీరదు. కాని నిన్ను మొదట్లో అనుమానించాను. యెవరో ఒక పిల్లను తెచ్చి నన్ను నమ్మించాలని అనుకుంటున్నావేమోనని సందేహించాను. ఐయామ్ సారీ! సారీ మిస్టర్ సురేష్" భూపతి అతని చేతులు పట్టుకుని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

సురేష్‌కి ఇబ్బందిగా వుంది ఆయనలా తనని ప్రాధేయ పడడం. పెద్దపులిలాంటి అయ్యగారు సురేష్‌ని అలా ప్రాధేయపడడం చూసి నౌకర్లంతా ఆశ్చర్యచకితులై పోయారు.

"ప్లీజ్! సార్! నన్ను అలా అడగకండి. నాకు సిగ్గుగా వుంటుంది. మీరు నన్ను సందేహించడం సహజమే. మీ స్థానంలో యెవరున్నా అలాగే చేస్తారు. మీరేమీ ఫీలవకండి" అన్నాడు సురేష్.

"సురేష్ ఈ శుభ సందర్భంలో నీకు ఒక కానుక ఇస్తున్నాను తీసుకో" అంటూ ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళి చెక్ రాసి, సంతకంపెట్టి తెచ్చి ఇచ్చాడు.

చెక్ మీద అంకె లక్ష వేసి వుంది.

"సార్!" అన్నాడు సురేష్ అయోమయంగా.

"యస్. నా ఆనందంకొద్దీ ఇస్తున్నాను. తీసుకో" గర్వంగా అన్నాడు భూపతి.

సురేష్‌కి మతిపోయినట్లయింది.

11

మర్నాడు సురేష్ ఆఫీసుకు వెళ్ళాడు.

అంతా చుట్టుముట్టారు. కంగ్రాట్స్ చెప్తూ చేతులు

కలుపుతుంటే అతనికి మతిపోయింది.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీకు తెలీదా? మీకు మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చింది."

"మరి మన మేనేజర్?"

"ఆయన గుండె జబ్బుతో పోయారుగా!"

"అరెరె.... నాకు తెలీదే! పాపం...." అంటూ విచారించాడు సురేష్.

తర్వాత మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు.

అతని మనసిప్పుడు గాలిలో తేలిపోతున్నది. తను ఈ కంపెనీకి మేనేజర్ అవుతాడని కలలో గూడా వూహించలేదు. ఎంత ఆశ్చర్యం? కారు, మేడ, టెలిఫోన్, టి.వి. అన్నీ ఇప్పుడు తన అందుబాటులోకి వచ్చాయి. మార్పు ఎంత త్వరగా జరిగిపోయింది? మేనేజర్‌కి గుండెపోటు రావడం, తను యజమాని ఇంటికి వెళ్ళడం, అక్కడ అనుపమను గుర్తించడం ...అంతా స్వప్నంలో మాదిరిగా జరిగి తనని వున్నత స్థానానికి తీసికెళ్ళాయి.

పర్సులోనుంచి బజ్జర్ నొక్కాడు. బంట్రోతు డోర్ నెట్టుకుని వచ్చి వినయంగా నిల్చున్నాడు. స్టాఫ్ మొత్తానికీ స్వీట్స్, కూల్ డ్రింక్‌లు తీసుకరమ్మని డబ్బిచ్చి పంపించాడు.

అందులోనుంచి బైటపడింది చెక్. నరేంద్ర భూపతి మనుమరాలు దొరికినందుకు కృతజ్ఞతపూర్వకంగా ఇచ్చిన చెక్.

అతనికి లక్షాధికారి కావాలని చిన్ననాటి కోరిక. అది ఈ నాటికి తీరింది.

కాని మానవుడికి తృప్తి అనేది లేదు. అది తాత్కాలిక మే. నిరంతరం అసంతృప్తితో సతమతమైపోతుంటాడు. అందని వాటిని సహితం అందుకోవాలని పాట్లు పడుతుంటాడు.

సురేష్ లక్షాధికారి అయినా, కంపెనీకి మేనేజర్ అయినా, అతనికింకా తృప్తిలేదు. ఇంకా చాలా సాధించాలని అనుకున్నాడు. అది అనుపమ. అనుపమ తన గుప్పిట్లో గువ్వ. ఆమెను పెళ్ళిచేసుకోవాలి. కోట్లకు అధిపతి కావాలి. విమానంలో దేశదేశాలు తిరగాలి.

సురేష్ తరచుగా నరేంద్ర భూపతి ఇంటికి రాకపోకలు సాగిస్తున్నాడు. తాతకి, మనుమరాలికి ఆత్మీయుడయ్యాడు. అనుపమ ఇప్పుడు చాలా మారిపోయింది. యువరాణీలా నాజూకుగా తయారైంది. ఆమెకు చదువు చెప్పడానికి గంటకో లెక్చరర్ ఇంటికి వస్తున్నాడు.

"అనుపమా! మనం పెళ్ళి చేసుకోవాలి?" అన్నాడు సురేష్ ఒకరోజు ఆమె ఒంటరిగా దొరికిన సమయం చూసి.

"కాని ఎలా సాధ్యం సురేష్?"

"ఏం?"

"నీకు పెళ్ళయింది. మర్చిపోయావా?" ఆమె గొంతు కఠినంగా పలికింది.

"అఫ్‌కోర్స్! నీ కోసం ఆమెను వదులుకుంటాను. నీ కోసం ఏమైనా చేస్తాను అనుపమా! ఐ లవ్ యూ!" ఆవేశంగా అన్నాడు.

"వద్దు సురేష్. నావల్ల మరొక స్త్రీ జీవితాంతం బాధపడగూడదు. నో.... పెళ్ళి ప్రస్తావన యెప్పుడూ తీసుకురాకు."

విసవిసలాడుతూ వెళ్ళిపోయాడు సురేష్.

'అనుపమ ఎంతలో మారిపోయింది? అగాధంలో వున్న దానిని అందలం యెక్కించాను. కూటికి గతిలేని దాన్ని కోట్లకు అధిపతిని చేశాను. ఏమాత్రం కృతజ్ఞత లేకుండా ప్రవర్తించింది.'

అతని మనసు కుతకుత వుడికింది. అక్కడొక క్షణం వుండలేకపోయాడు. కారులో కూర్చున్నాడు.

"బార్ కి పోనియ్యి" అన్నాడు.

బార్ లో కూర్చుని రెండు పెగ్గులు విస్కీ తాగాక మనసు శాంతించింది. ప్రశాంతంగా కూర్చున్నాడు.

'అనుపమ చెప్పిందిగూడా నిజమే. కోటీశ్వరుడి మనుమరాలు పెళ్ళయిన వాడిని ఎలా పెళ్ళి చేసుకుంటుంది? నరేంద్ర భూపతి మాత్రం ఒప్పుకుంటాడా? తను చేసిన సహాయానికి ఎంత డబ్బయినా ఇవ్వడానికి సిద్ధపడొచ్చు. కాని మనుమరాలినిచ్చి పెళ్ళి చేస్తాడా?'

సురేష్ మనసులో తుఫాన్ చెలరేగుతోంది. అందులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అందుకు కారణం మానవుడికి తృప్తిలేకపోవడమే.

12

కారు నగరం పొలిమేరలు దాటింది.

చీకటి పడొచ్చింది.

అప్పుడప్పుడూ వస్తూ పోతున్న వాహనాల చప్పుడు తప్ప నర సంచారంలేదు.

సురేష్ కారు రోడ్డు దించాడు. ఫర్లాంగు దూరం పోయాక ఆపాడు.

అనుపమ మౌనంగా కూర్చుంది.

"ఇక్కడ ఎంత హాయిగా వుంటుందో? చూడు"

అన్నాడు.

ఇద్దరూ కారు దిగారు.

కొండల నడుమ పెద్ద బండరాయి వేదికలా వుంది. దానిమీద కూర్చున్నారు.

"నిన్నింత దూరం ఎందుకు తీసుకొచ్చానో తెలుసా?" అన్నాడు సురేష్.

"వూహూఁ ..." అంది అనుపమ.

"తెలుసుకో చూద్దాం" అన్నాడు చిరునవ్వుతో.

ఆమె కొన్ని క్షణాలు ఆలోచించి "ఏవుంటుంది? నీకు పెళ్ళి పిచ్చి పట్టింది. అందుకు" అంది.

అతను నవ్వి "కరెక్టు" అన్నాడు.

"అవును అనుపమా! మన పెళ్ళికి ఇక ఏ అడ్డంకీ లేదు" అన్నాడు.

"అంటే?" ఆశ్చర్యంగా అంది ఆమె.

"నా భార్య ఇక లేదు."

"ఏమైంది."

"అడ్డు తొలగించాను."

"ఆఁ....ఎలా?"

"రేపు బంధువుల పెళ్ళి అని శుభలేక వచ్చింది. నాకు కుదరదు తనని వెళ్ళమన్నాను. సరే అంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు కారులో బయల్దేరాం. బస్ స్టాండ్‌కి అని తను అనుకుంది. టాంక్ బండ్ మీద కారు ఆపాను. ఏదో రిపేరు అని బోనట్ ఎత్తాను. ఆమె రెయిలింగ్స్ దగ్గర నిల్చుంది. నేను దగ్గరగా వెళ్ళాను. కారు చెడిపోయింది అన్నాను. ఎలా? అంది. అటూ ఇటూ చూశాను. కార్లు, ఆటోలు ఏవీ రావడంలేదు. అమాంతం ఎత్తి హుస్సేన్ సాగర్లో పడేశాను. పీడ వది

లింది. రేపు శవం తేలుతుందనుకుంటాను" సురేష్ చెప్పడం ముగించాడు.

అదంతా విని అనుపమ సీరియస్‌గా అయిపోయింది. హేండ్ బ్యాగ్ తెరిచి పిస్టల్ తీసి గురిపెట్టి అతన్ని కాల్చింది. అంతా క్షణంలో జరిగిపోయింది.

కవ్వన కేక పెట్టాడు సురేష్.

"అన్యాయం...." అతని పెదవులు హీనస్వరంతో పలికాయి.

ఆమె వికటంగా నవ్వింది.

"దుర్మార్గుణ్ని చంపడం అన్యాయం ఎన్నటికీ కాదు. నువ్వు దుర్మార్గుడివి. డబ్బుకోసం ఎందర్నయినా చంపుతావు. ఆ రోజు కిషన్ని చంపావు. ఈ రోజు నీ భార్యని చంపావు. నిన్ను నమ్మి పెళ్ళిచేసుకుంటే రేపు నన్ను చంపవని గ్యారంటీ ఏముంది? మనిషి నెత్తురు మరిగిన పులివి నువ్వు. నిన్ను బ్రతకనివ్వకూడదు. నీ పంజా నీడలో నాకు దినదిన గండమే. నువ్వు చావాలి."

అనుపమ మరొకసారి కాల్చింది.

సురేష్ దేహంలో చలనం ఆగిపోయింది.

అనుపమ కారు డ్రైవ్ చేసుకుంటూ నగరంవైపు బయల్దేరింది.

—: అయిపోయింది :—